సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం। 13। జూన్। 2025



ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరులోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం జిల్లా స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. -8లో



చదువుకు మార్గం.. సార్వత్రిక విద్యా పీఠం

చదువుకోవాలన్న ఆసక్తి ఉండి కుటుంబ పరిస్థితులు అనుకూలించక నిత్యం స్కూల్ లేక కళాశాలకు వెళ్ల లేని వారికి ఓపెన్ స్కూల్ బాసటగా నిలుస్తోంది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.9/24.8

వాతావరణం

జిల్లాలో గురువారం 24.8 - 33.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'డీఎస్సీ'కి 275 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షకు గురువారం 275 మంది గైర్హాజరయ్యారు. ఉదయం విడతలో 8 పరీక్షా కేంద్రాలకు సంబంధించి 1410 మంది అభ్యర్థులకు గాను 1325 మంది హాజరు కాగా 85 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1410 మందికి గాను 1220 మంది హాజరు కాగా 190 మంది గైర్హాజయ్యారు. మొత్తం 2820 మందికి గాను 2545 మంది హాజరు కాగా 275 మంది గైర్హాజరయ్యారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి



జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

కడప అగ్రికల్చర్: జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. ఆయన గురువారం జిల్లా వ్యవసాయ అధికారిగా కడప కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

డీసీఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటసుబ్బయ్య

కడప అగ్రికల్చర్: జిల్లా కో ఆపరేటివ్ అధికారి(డీసీఓ)గా వెంకటసుబ్బయ్య గురువారం కడప కలెక్టరేట్‌లోని కోఆపరేటివ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు జిల్లా డ్వామా పీడీగా, జెడ్పీ సీఈఓగా పని చేశారు. అలాగే నంద్యాల జిల్లాలో డీఆర్‌డీఏ పీడీగా పనిచేయడంతోపాటు డీసీఓగా పని చేస్తూ తాజాగా వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోఆపరేటివ్ రంగ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

మెరుగైన విద్యే లక్ష్యం



డీఐఈఓ ను సన్మానిస్తున్న లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా పని చేస్తామని ఇంటర్మీడియెట్ విద్య వైఎస్సార్ కడప జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి(డీఐఈఓ) టీఎస్‌వీవీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన గురువారం తన చాంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లాలోని మురుమండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చూస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రామక్రిష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీ రవీంద్రారెడ్డి, ట్రెజరర్ రమణయ్య, స్టేట్ కౌన్సిలర్ పద్మావతి, అధ్యాపకులు నాగ మహేశ్వరరెడ్డి, హబీబుల్లా సన్మానించారు.

మోగిన బడి గంట

- సెలవులకు టాటా
- వడివడిగా పాఠశాల బాట
- మొదలైన చదువుల సందడి
- ఇక పుస్తకాలతో కుస్తీ
- తొలిరోజు అంతంత మాత్రమే హాజరు





పిల్లలను పాఠశాలకు తీసుకొస్తున్న తల్లి



కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ప్రార్థన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

కడప ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో ఆటపాటలతో మునిగి తేలిన చిన్నారులు.. ఇక చదువులకు స్వాగతం చెప్పారు. బుద్ధిగా పుస్తకాల బ్యాగ్‌ను భుజాన వేసుకుని.. బడిబాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. దీంతో చిన్నారులు ఆటపాటలతో సందడి చేసిన క్రీడామైదానాలు, వీధులు ఒక్కసారిగా బోసిపోయాయి. ఇళ్లలో పిల్లలు చేసే అల్లరి, గోల మూగబోయింది. తొలిరోజు కొంత మంది పిల్లలు మారం చేయగా.. తల్లిదండ్రులు బుజ్జగిస్తూ పాఠశాలకు తీసుకెళ్లారు. మరికొంత మంది విద్యార్థులు



బై రా చిన్నా..

ఉత్సాహంగా వెళ్తూ కనిపించారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల వద్ద వదిలి వెళ్లగా.. మరి కొంత మంది ఆటోలు, స్కూల్ బస్సుల్లో వచ్చారు. పాఠశాలల ఆవరణలో సందడి నెలకొంది.

తల్లిదండ్రులు 'బాగా చదువుకో నాన్నా' అంటూ తరగతి గదులకు పంపారు. ఏది ఏమైనా తొలిరోజు పాఠశాలల్లో పిల్లలతో కొత్త కళ కనిపించింది.

యోగ క్షేమాలు.. హిత బోధనలు

దాదాపు 50 రోజుల తరువాత విద్యార్థులు పాఠశాలకు రావడంతో.. ఉపాధ్యాయులు తొలుత వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలువురు ఉపాధ్యాయులు కుశల ప్రశ్నలు వేస్తూ.. కాస్త సరదాగా గడిపారు. వేసవి సెలవులను ఎలా గడిపారు, ఎక్కడెక్కడికి వెళ్లారు, టూర్‌లకు వెళ్లి ఉంటే అక్కడి విశేషాలేమిటి అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు మాత్రం ఉపాధ్యాయులు హితబోధనలు చేశారు. సమయాన్ని వృథా చేయకుండా గడిపితేనే.. అత్యధిక మార్కులు సాధించగలరని సూచించారు. ఈరోజు నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని వారికి చెప్పారు.

మొదటి రోజు..

మొదటి రోజు అనుకున్న మేర పిల్లలు బడులకు హాజరు కాలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించి 2786 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 2,72,200 మంది విద్యార్థులు ఉండగా.. 1,32,746 మంది హాజరయ్యారు. 69.41 శాతం హాజరు నమోదైంది.

స్నేహితులతో సందడి



విద్యార్థులు చాలా రోజుల తరువాత కలుసుకోవడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. స్కూల్ విరామ సమయంలో స్నేహితులంతా ఒక చోట కూర్చొని.. సెలవుల్లో గడిపిన విషయాలను సరదాగా చెప్పుకొంటూ నవ్వులతో కనిపించారు. చాలా రోజుల తరువాత బడి ఒడిలో స్నేహితులు కలవడంతో వారిలో ఆనందం తొణికిసలాడింది.



ఊరించి.. ఉసూరుమనిపించి..

- మొదటి రోజే అన్నీ అందిస్తామని కూటమి డాంబికాలు
- వాయిదాలతో ప్రభుత్వం సాగదీత
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం



కడప ఎడ్యుకేషన్: 'పాఠశాలలు తెరిచే నాటికి బదిలీల కార్యక్రమం పూర్తి చేస్తాం. బడి తెరిచిన రోజు పిల్లలందరికీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు అందజేస్తాం. అదే రోజు తల్లికి వందనం నిధులు తల్లుల ఖాతాలకు జమ చేస్తాం' అనే మాటలన్నీ నీటి మీద బుడగలని మరోమారు కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎందుకుంటే పాఠశాలలో తెరుచుకున్నా.. ఇంకా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ జరుగుతూనే ఉంది. బదిలీలు, పదోన్నతులు పొందిన వారు.. వారి స్థానాల్లో చేరిపోలేదు. చాలా స్కూళ్లకు విద్యార్థుల బూట్లు, బ్యాగులు అందలేదు. తల్లికి వందనం విషయానికి వస్తే పాఠశాలలు తెరిచిన రోజే.. తల్లుల ఖాతాలకు నగదు జమ చేస్తామని చెప్పారు. ఎంత మంది పిల్లలను బడికి పంపితే అందరికీ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాకు నగదు జమ చేస్తామన్నారు. తీరా బడి తెరిచిన రోజు మాట మార్చి వచ్చే నెల 6న తల్లుల ఖాతాలకు నగదు జమ చేస్తామని చెప్పి తుస్సుమనిపించారు. అందులో కూడా రూ.15 వేలు కాదు రూ.13 వేలేనని చెప్పి తల్లుల ఆశలను అడియాసలు చేశారు. ఇందులో రూ. 2 వేలు పాఠశాల మెయింటెనెన్స్‌కు అని చెప్పి మాట మార్చారు. ఉపాధ్యాయ బదిలీల విషయానికి వస్తే.. పాఠశాలలు తెరిచే నాటికి ఉపాధ్యాయ బదిలీలను పూర్తి చేస్తామన్నారు. కానీ బదిలీల ప్రక్రియ పూర్తికాక పోగా అదో ప్రహసనంగా సాగుతోంది. ఈ బదిలీల ప్రక్రియ ఈ నెల 14వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. పూర్తి కాకపోవడంతో.. పాఠశాలలు తెరుచుకున్నా ముందుగా బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు కూడా వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరలేకపోయారు. పాఠశాలలు తెరుచుకున్నా.. ఇలా పలు సమస్యలతో పరిస్థితులు గందరగోళంగా ఉన్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ఇక ఒంటిమిట్ట మండల పరిధిలోని చిన్న కొత్తపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాలలో 6,7,8 తరగతులను తొలగించ కూడదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. 1946 నుంచి 7వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 8వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసింది. అయితే ఈ ప్రభుత్వం వచ్చాక ఇలాంటి పనులు చేస్తోందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ఇక్కడే కాదు.. చాలా పాఠశాలల్లో పునరావృతం కానున్నట్లు తెలిసింది.

పాఠశాలను విలీనం చేస్తే ఒప్పుకోం!

- విద్యార్థులను పాఠశాలకు పంపబోమని తేల్చిచెప్పిన సిద్దారెడ్డిపల్లె గ్రామస్తులు
- నచ్చజెప్పే ప్రయత్నం చేసిన ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు

చాపాడు: తమ ఊరిలోని పాఠశాలను వేరే గ్రామంలోకి విలీనం చేస్తే ఒప్పుకోబోమని సిద్దారెడ్డిపల్లె వాసులు తేల్చిజెప్పారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో సిద్దారెడ్డిపల్లెలోని ప్రాథమిక పాఠశాలలో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. ఇక్కడ ఉండే 3, 4, 5 తరగతులకు చెందిన 19 మంది విద్యార్థులను గ్రామ నుంచి 1.50 కిలోమీటర్ల దూరంలో ఉండే మొర్రాయిపల్లె మోడల్ స్కూల్‌లో విలీనం చేశారు. ఈ క్రమంలో గురువారం విద్యార్థులను తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులు రాగా తల్లిదండ్రులు పంపబోమని వారితో చెప్పారు.

గతంలో ఇదే విధంగా విద్యార్థులను పంపబోమని చెప్పినప్పటికీ.. ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. తమ పిల్లలను ఇంటి వద్దనైనా ఉంచుకుంటామని, దూరంగా ఉండే పాఠశాలకు మాత్రం పంపబోమన్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ.. ససేమిరా అన్నారు. కిలో మీటర్ కంటే ఎక్కువ



విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

దూరంలో ఉండే పాఠశాలకు విద్యార్థులను పంపిస్తే ఆటో చార్జీల కోసం రూ.600 చెల్లించే నిబంధనలు ఉన్నప్పటికీ.. కేవలం ఇక్కడ పాఠశాలల మధ్య వ్యత్యాసం 700 మీటర్లు మాత్రమే ఉన్నట్లు చూపడంతో.. ఆటో చార్జీల చెల్లింపు అవకాశం కూడా లేకుండా చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు తమ పిల్లలను ఎలా పంపాలని, దారిలో నడిచి వెళితే ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. తమ గ్రామం నుంచి మొర్రాయిపల్లెకు ఆటో సౌకర్యం కూడా లేకపోవడంతో.. తమ గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలని తెలిపారు. లేనిపక్షంలో ఇక్కడి నుంచి తమ పిల్లలను విలీన పాఠశాలకు పంపబోమని తల్లిదండ్రులు తెగేసి చెప్పారు.

ఏడాది పాలన అంతా మోసం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా మోసపూరితమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన పులివెందులలోని తన స్వగృహం వద్ద మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం రూ.1.51 లక్షల కోట్లు అప్పు చేయడం జరిగిందని, కానీ ప్రజలకు మాత్రం ఏ సంక్షేమ పథకాన్ని అందజేయలేదన్నారు. రైతు భరోసా, అమ్మఒడి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, మహిళలకు ఏడాదికి రూ.18 వేలు ఇలా అనేక రకాల హామీలను ఏడాదైనా అమలు చేయలేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో మొదటి ఏడాది పాలనలో సచివాలయాల్లో 1.34 లక్షల మంది ఉద్యోగులు, 2.75 లక్షల మంది వలంటీర్లను నియమించడం జరిగిందన్నారు. అలాగే పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని చట్టం చేశారన్నారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారన్నారు. అమ్మఒడి ద్వారా విద్యార్థుల తల్లులకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారని పేర్కొన్నారు. పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్స్, నోటు బుక్స్ వంటివి విద్యా కానుక ద్వారా అందించారని తెలిపారు. మహిళల భద్రత కోసం దిశ యాప్‌ను ప్రవేశ పెట్టారన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా అందించడమేకాక రాయితీపై విత్తనాలు, ఎరువులు సరఫరా చేశారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం ప్రభుత్వం అప్పట్లో కొనుగోలు చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ హామీని విస్మరించకుండా కరోనా వంటి క్లిష్ట పరిస్థితులలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత దేశంలోనే ఒక్క వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు. అలా కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రస్తుత ప్రభుత్వం ఏడాది పాలనపై సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అనంతరం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

జర్నలిస్టుల క్రికెట్ టీంను అభినందించిన ఎంపీ

గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల క్రికెట్ పోటీలలో విజేతగా నిలిచిన కడప జర్నలిస్టుల టీంను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పట్టణంలోని తన నివాసం వద్ద అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాబోయే క్రీడలలో రాణించాలని ఆయన కోరారు. త్వరలో రాష్ట్రస్థాయి జర్నలిస్టుల క్రీడా పోటీలు పులివెందులలో నిర్వహించాలని, అందుకు తాను పూర్తిగా సహకరిస్తానని జేశాప్ నాయకులకు హామీ ఇచ్చారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసిన వారిలో జేశాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, జేశాప్ రాష్ట్ర సలహాదారు భూమిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టా మాధవరెడ్డి, టీం సభ్యులు షరీఫ్, పఠాన్, శేషు, అరుణ్, ప్రభంజన్ రెడ్డి, జయ రామ కృష్ణారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, శివకేశవరెడ్డి, సురేంద్ర తదితరులు ఉన్నారు.

రెండు రోజుల్లో కౌన్సిల్ హాలు తెరవాలి

- లేనిపక్షంలో మీడియా సమక్షంలో తెరుస్తాం
- నగరపాలక అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదు
- మేయర్‌గా సురేష్ ఉంటే కుర్చీ ఉండదు.. అనర్హత వేటు వేసి తొలగిస్తే అడ్డు ఉండదనే కుట్రలు
- కడప మేయర్ కె.సురేష్‌బాబు కీలక వ్యాఖ్యలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: 'కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం జరిగే కౌన్సిల్ హాలులో ఏ మర్మం దాగి ఉందో ఎవరికీ తెలియడం లేదు.. నేను స్వయంగా కౌన్సిల్ హాలు తెరవాలని కోరినా కమిషనర్ స్పందించడం లేదు' అని మేయర్ సురేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలను చిన్నచూపు చూస్తోందని, ఏడాది పాలనలో వారు ప్రజలకు చేసింది శూన్యమన్నారు. కూటమి సర్కార్ రాష్ట్రంలో దాదాపు అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను అక్రమంగా కైవసం చేసుకుందన్నారు. అందులో భాగంగానే కడప కార్పొరేషన్‌లో కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ సంస్థ తనకు తెలియకుండా రిజిస్టర్ అయిందని, రిజిస్టర్ అయినప్పటి నుంచి ఆ సంస్థ చేసిన పనులు రూ.36 లక్షలలోపే అన్నారు. ఈ పనుల్లో ఎక్కడా అవినీతి జరగలేదని, నాణ్యతా లోపాలు కూడా లేవన్నారు. అయినా కోట్ల రూపాయలలో స్కాం జరిగిందంటూ దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు.

కార్పొరేటర్లకు ఆహ్వానం పంపకుండా అవమానం

కార్పొరేషన్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించే కౌన్సిల్ హాలుకు తాళాలు వేశారని, తాళాలు తీసి ఓపెన్ చేయాలని తాను స్వయంగా అడిగినా కమిషనర్ స్పందించడం లేదన్నారు. సమావేశ మందిరంలో ఏ మర్మం దాగి ఉందోనని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. నగరపాలక అధికారులు ఒకరిపై ఒకరు వేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని, తాళాలు ఎక్కడ ఉన్నాయో కమిషనర్ తెలపాలన్నారు. రెండు రోజుల్లో కౌన్సిల్ హాలు తెరవకపోతే మీడియా సమక్షంలో తామే తాళాలు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. కడప కార్పొరేషన్‌లో పాలకవర్గంగా ఉన్న తమ మాట అధికారులు వినడం లేదని, అన్ని డివిజన్లలో కార్పొరేటర్లకు ఆహ్వానం పంపకుండా అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు.

చట్టం ప్రకారం నడుచుకున్నాం

గతంలో మేయర్‌గా తన విచక్షణాధికారాలను వినియోగించి కడప, కమలాపురం ఎమ్మెల్యేలకు ఎక్స్ అఫిసియో సభ్యుల హోదాలో వేదికపై కుర్చీలు వేశామన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి అహంకార పూరిత వైఖరి చూశాక చట్టం ప్రకారం నడుచుకున్నామని, మేయర్‌కు తప్ప మరెవరికీ వేదికపై కుర్చీలు వేయలేదన్నారు. దీంతో గత రెండు సమావేశాల్లో ఎమ్మెల్యే మాధవి నానా రచ్చ చేశారని, తాను మేయర్‌గా ఉంటే కార్పొరేషన్‌లో తనకు కుర్చీ ఉండదని గ్రహించి తనను ఎలాగైనా దించేయాలని కుట్ర పన్నారన్నారు. ఇందులో భాగంగానే తమ పార్టీకి చెందిన 8 మంది కార్పొరేటర్లను ప్రలోభాలకు గురి చేసి పార్టీ మారేలా చేశారన్నారు. మిగతా వారు రాకపోవడంతో తన కుమారుడి కాంట్రాక్టు సంస్థను బూచిగా చూపి అనర్హత వేటు వేయాలని ప్రయత్నించారన్నారు.

న్యాయసమ్మతం కాదు

ఒక కాంట్రాక్టు సంస్థను మున్సిపాలిటీల్లో రిజిస్ట్రేషన్ చేయడం చెల్లదని.. అయినా చేశారన్నారు. రూ.10 లక్షలలోపు పనులు తన దృష్టికి వచ్చే అవకాశమే లేదన్నారు. దీని ఆధారంగా తనపై అనర్హత వేటు వేయాలనుకోవడం న్యాయసమ్మతం కాదన్నారు. ఈ నెల 16న విచారణకు తప్పకుండా హాజరవుతానని, తన వివరణను ప్రభుత్వానికి తెలియజేస్తానన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పాకా సురేష్, మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, మగ్బూల్‌బాషా, డివిజన్ ఇన్‌చార్జులు శ్రీరంజన్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, సుబ్బరాయుడు, ఐస్‌క్రీం రవి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు 'మహా' నష్టం

మహానాడు సందర్భంగా కడప కార్పొరేషన్ పరిధిలో ఎన్నో ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్లు కట్టారని, కానీ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్ చెల్లించలేదన్నారు. దీనివల్ల నగరపాలక సంస్థకు లక్షల రూపాయల్లో నష్టం జరిగిందన్నారు. కార్పొరేషన్‌లో కమిషనర్ మనోజ్‌రెడ్డి నియంత పాలన సాగిస్తున్నారని, పరిపాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. రాష్ట్రంలో మరెక్కడా ఇలాంటి దౌర్భాగ్య పాలన లేదని ఆవేదన వ్యక్తం చేశా రు. మేయర్‌గా తనకే ఇలాంటి దౌర్భాగ్య పరి స్థితులు ఉంటే కార్పొరేటర్లు, సామాన్య ప్రజలకు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు.

దేవదాయ అధికారులకు లోకాయుక్త నోటీసులు

- శ్రీకృష్ణ గీతాశ్రమంలోని అవినీతిపై ఆరా
- రూ.5 లక్షల చెల్లింపుపై వివాదం
- కమిషనర్ ఆదేశాలను తుంగలో తొక్కిన వైనం



ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణ గీతాశ్రమం

ప్రొద్దుటూరు : దేవదాయ శాఖ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌తోపాటు ఈఓలకు ఈనెల 3వ తేదీన లోకాయుక్త నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణ గీతాశ్రమంలో చోటు చేసుకున్న అవినీతిపై సమాధానం చెప్పాలని లోకాయుక్త కోరింది. గీతాశ్రమంలోని ఈఓ కార్యాలయంలో అటెండర్‌గా పని చేసిన బి.జనార్దన్‌రెడ్డికి ఈఓ రామచంద్రాచార్యులు వేతన రూపంలో రూ.5 లక్షలు చెల్లించారు. గీతాశ్రమం నిర్వహణకు సంబంధించిన డబ్బును ఇందుకోసం వినియోగించారు. గతంలో ఇదే కార్యాలయంలో పని చేసిన జనార్దన్‌రెడ్డి ప్రవర్తన సరిగా లేకపోవడంతో.. ఆశ్రమ నిర్వాహకుడిగా ఉన్న గంగాధరానంద గిరి స్వామి తొలగించారు. 2021 జూలై నుంచి జనార్దన్‌రెడ్డి విధులకు హాజరు కాకపోగా.. రోజూ కార్యాలయ పరిసరాలకు వచ్చి గూగుల్ ద్వారా ఫొటోలు తీసుకుని కోర్టును ఆశ్రయించాడు. తాను రోజు విధులకు హాజరవుతున్నానని తెలిపాడు. కోర్టు నోటీసు మేరకు గతంలో పని చేసిన దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్.. జనార్దన్‌రెడ్డి ప్రవర్తన సరిగా లేని మాట వాస్తవమేనని, గంగాధరానందగిరి స్వామి ఇచ్చిన లేఖను సమర్పిస్తూ కోర్టుకు అఫిడవిట్ దాఖలు చేశారు. అప్పటి నుంచి జనార్దన్‌రెడ్డికి, గీతాశ్రమానికి సంబంధాలు లేవు. కాగా ఇటీవల ఈఓ రామచంద్రాచార్యులు అతనికి లీజు బకాయిలు ఉన్నాయని చెప్పి రూ.5 లక్షలు చెల్లించడం జరిగింది. విధులకు రాని వ్యక్తికి రూ.5 లక్షలు దేవదాయ శాఖ సొమ్మును ఎలా చెల్లిస్తారని, దీనిపై విచారణ జరిపి ఆ డబ్బును తిరిగి ప్రభుత్వానికి జమ చేయాలని కోరుతూ పర్లపాడు గౌరీశంకర్ అనే వ్యక్తి లోకాయుక్తలో పిటీషన్ దాఖలు చేశారు. ఈ మేరకు దేవదాయశాఖ అధికారులకు లోకాయుక్త నోటీసులు అందాయి. ఏకంగా కమిషనర్ ఉత్తర్వులను కాదని ఈఓ రామచంద్రాచార్యులు అప్పనంగా జనార్దన్‌రెడ్డికి డబ్బు చెల్లించడం చర్చనీయాంశంగా మారింది. జనార్దన్‌రెడ్డిని తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వుల ప్రతులు, కమిషనర్ కోర్టుకు ఇచ్చిన అఫిడవిట్ వివరాలు అందుబాటులో ఉన్నాయి. అన్నీ కాదని ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని ఇలా చేశారు. ఇది ఇలా ఉండగా ఈఓగా పని చేసిన రామచంద్రాచార్యులు గత నెలాఖరునే పదవీ విరమణ చెందారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది. గీతాశ్రమానికి సంబంధించి అనేక అవినీతి ఆరోపణలు వెల్లువలా ఉన్నా.. దేవదాయశాఖ అధికారులు ఇంకా నిద్రమత్తు వీడలేదు.

క్లుప్తంగా

ఉత్సాహంగా జిల్లా స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు



పోటీల్లో విజేతలైన వారు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం జిల్లా స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో స్త్రీ, పురుషులకు 100 మీ., 200 మీ., 400 మీ., 800 మీటర్ల పరుగు పోటీలు, లాంగ్‌జంప్, షార్ట్ పుట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 70 మంది పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారు ఈనెల 14, 15 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని ఫౌండేషన్ కార్యదర్శి అహమద్ బాషా తెలిపారు. ఎం.లోకేశ్వరరావు, జి.సింహాచలం, పి.మంజునాథ, బి.యేసు వరప్రసాద్, కె.మహేష్, బి.మల్లికార్జున, ఆర్.మునినరేంద్ర, డి.నీలా మహేశ్వరి, ఎస్.స్నేహలత, నాగనవీన రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ఈ పోటీలను వ్యాయామ సంచాలకులు నాగేశ్వరరావు, ఖాదర్ రెడ్డి, కుమార్, దిలీప్, కోచ్ అనిల్ పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన మైస్పేస్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు అకాడమీ డైరెక్టర్ మాస్టర్ సలీం తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో ఫాతిమా, అలోక్య, హసేన్ సత్తా చాటి బంగారు పతకాలు సాధించారని ఆయన పేర్కొన్నారు. అలాగే క్యాడెట్ విభాగంలో హసేన్, కౌసర్ బంగారు పతకాలు సాధించారన్నారు. ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్‌లో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను చీఫ్ కోచ్ మహబూబ్ బాషా, కోచ్‌లు ఇస్మాయిల్, రియాజ్, సాయికళ్యాణ్ అభినందించారు.

చదువులకు మార్గం.. సార్వత్రిక విద్యా పీఠం

- ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- వయసుతో సంబంధం లేకుండా చదువుకునేందుకు అందరూ అర్హులే
- టెన్త్, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



ఓపెన్ స్కూల్ స్టడీసెంటర్ ఉన్న రాజంపేటలోని ప్రభుత్వ హైస్కూల్



సార్వత్రిక విద్యాపీఠం లోగో

రాజంపేట టౌన్ : చదువుకోవాలన్న ఆసక్తి ఉండి కుటుంబ పరిస్థితులు అనుకూలించక నిత్యం, స్కూల్ లేక కళాశాలకు వెళ్లలేని వారికి ఓపెన్ స్కూల్ బాసటగా నిలుస్తోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నామమాత్రపు ఫీజుతో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా (ఏపీ ఓపెన్ స్కూల్) రాష్ట్ర ప్రభుత్వం దూర విద్యను అందిస్తుంది. రెగ్యులర్ చదువుతో సమానమైన ఈ కోర్సుల్లో వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు చదువుకునేందుకు అర్హులే. రెగ్యులర్‌గా చదివి టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయిన వారు, చదువు మధ్యలో నిలిపేసిన వారు, తక్కువ విద్యార్హతతో ఏళ్ల తరబడి చిరుద్యోగం చేస్తున్న వారు, వ్యాపారులు, గృహిణులు, ప్రజా ప్రతినిధులు ఇలా ఎవరైనా ఓపెన్ స్కూల్‌లో చేరవచ్చు. గతంలో ఈ విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేది. ప్రస్తుతం సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో చదువుకోవచ్చు.

నోటిఫికేషన్ విడుదల..

2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఆసక్తిగల వారు ఈ ఏడాది జూలై 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. టెన్త్‌లో ప్రవేశానికి 14 సంవత్సరాలు నిండి ఉండాలి. అలాగే ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి చదివి వుంటే రికార్డు షీటు, ఆరవ తరగతి నుంచి ఆపై చదివి వుంటే టీసీ, టెన్త్ ఫెయిల్ అయివుంటే టీసీతో పాటు ఫెయిల్ అయిన మార్కుల మెమో కలిగి వుండాలి. ఇక ఏమీ చదవకుండా ఉంటే సంబంధిత అధికారులు జారీ చేసే జనన ధృవీకరణ పత్రం కలిగివుంటే టెన్త్‌లో ప్రవేశానికి అర్హులవుతారు. టెన్త్‌లో ఐదు సబ్జెక్టులు ఉంటాయి. ఆప్షనల్ సబ్జెక్ట్‌గా హిందీని తీసుకోవచ్చు. ఇక టెన్త్ ఉత్తీర్ణులైన వారు ఇంటర్మీడియట్‌లో చేరేందుకు అర్హులు. ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూపు తీసుకున్నా ఐదు సబ్జెక్టులు చదవాల్సి వుంటుంది.

రెగ్యులర్ సర్టిఫికెట్‌లతో సమానం..

ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్‌కు రెగ్యులర్ విద్యార్థుల సర్టిఫికెట్‌తో తత్సమానంగా ప్రాధాన్యత ఉంటుందో ఉండదో అని చాలా మందిలో అపోహ వుంది. అయితే అది అవాస్తవం. ఓపెన్ స్కూల్ సొసైటీ జారీ చేసే ఉత్తీర్ణత సర్టిఫికెట్లు సాధారణ పాఠశాల విద్య, కళాశాల విద్య సర్టిఫికెట్లతో సమానం. ఉన్నత చదువులు చదువుకునేందుకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

జిల్లాలో 41 స్టడీ సెంటర్లు..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో టెన్త్, ఇంటర్మీడియట్‌కు సంబంధించి 41 కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో స్టడీ సెంటర్‌లో టెన్త్‌లో 100 సీట్ల చొప్పున ఉంటాయి. అలాగే ఇంటర్‌లో నాన్ సైన్స్ గ్రూపులకు సంబంధించి 40 సీట్లు, సైన్స్ గ్రూపులకు సంబంధించి 100 సీట్లు ఉంటాయి. అడ్మిషనన్ పొందిన వారికి ఓపెన్ స్కూల్ సొసైటీ ఉచితంగా పుస్తకాలు ఇస్తుంది. ప్రతి ఆదివారం, రెండవ శనివారం వంటి సెలవు రోజుల్లో తరగతులను నిర్వహిస్తారు. దాదాపు 30 కాంట్రాక్టు తరగతులను నిర్వహిస్తారు. ఇందులో 24 కాంట్రాక్టు తరగతులకు హాజరైన వారికి మాత్రమే పబ్లిక్ పరీక్ష రాసేందుకు అనుమతి ఉంటుంది. విద్యార్థులు వెంటనే ఉత్తీర్ణులు కాకుంటే ఐదు సంవత్సరాల్లో తొమ్మిది మార్లు పరీక్ష రాసి ఉత్తీర్ణులు కావచ్చు.

ఇంటర్‌లో సైన్స్, ఆర్ట్స్ గ్రూపులు..

ఇంటర్మీడియట్‌లో సైన్స్, ఆర్ట్స్ గ్రూపులు ఉంటాయి. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంఈసీ, ఎంబైపీసీ గ్రూపులు ఉంటాయి. ఇందులో విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపులో చేరవచ్చు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, ఒరియా మీడియంలు ఉన్నాయి. వీటిలో విద్యార్థులు తమకు నచ్చిన మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. ఇంటర్మీడియట్‌లో ఐదు సబ్జెక్టులు ఉంటాయి. టెన్త్ ఉత్తీర్ణులైన సంవత్సరంలోనే ఇంటర్ చేరితే ఇంటర్మీడియట్‌లో నాలుగు సబ్జెక్టులు మాత్రమే పరీక్ష రాసుకోవాల్సి వుంటుంది. ఆ తరువాత ఏడాది మరొక సబ్జెక్ట్ రాసుకోవాల్సి వుంటుంది. టెన్త్ ఉత్తీర్ణులైన తరువాత ఒక ఏడాది గ్యాప్ ఉంటే ఐదు సబ్జెక్టులు ఒకేసారి రాసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ :30-7-2025

200 రూపాయల అపరాధ రుసుముతో 1-8-2025 నుంచి 15-8-2025 వరకు ప్రవేశం పొందవచ్చు.

కొత్త స్టడీ సెంటర్లకు దరఖాస్తు చేసుకోవచ్చు..



ఈ ఏడాది కొత్తగా ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి గల ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే వివిధ కారణాల రీత్యా రెగ్యులర్‌గా టెన్త్, ఇంటర్మీడియట్ చదవలేని వారికి ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్‌ను పూర్తి చేసుకోవడానికి ఇది చాలా చక్కటి అవకాశం. ఈ ఉత్తీర్ణత సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు వుంది. అందువల్ల ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయి.

– కొండూరు శ్రీనివాసరాజు, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్

పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- రాష్ట్రంలో వైఎస్సార్ జిల్లా 6వ స్థానం
- 5288 మందికి 4635 మంది ఉత్తీర్ణులు
- ఈ ఫలితాల్లో కూడా బాలికలదే పైచేయి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు గురువారం సాయంత్రం విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మే 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు 28 పరీక్షా కేంద్రాలలో పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలను జిల్లాలో 5288 మంది విద్యార్థులు రాయగా ఇందులో 4635 మంది ఉత్తీర్ణులై 87.65 శాతం మేర ఉత్తీర్ణతను సాధించి రాష్ట్రంలో వైఎస్సార్‌జిల్లా 6వ స్థానంలో నిలిచింది. ఈ ఫలితాల్లో కూడా బాలికలదే పై చేయిగా నిలిచింది.

బాలబాలికలకు సంబంధించి..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 5288 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఇందులో 3113 మంది బాలురు పరీక్ష రాయగా 2676 మంది పాసై 85.96 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే బాలికలకు సంబంధించి 2175 మంది పరీక్ష రాయగా ఇందులో 1959 మంది పాసై 90.07 శాతం ఉత్తీర్ణతను సాధించారు.

ఓపెన్ పది ఫలితాల్లో రాష్ట్రంలో 3వ స్థానం..

ఓపెన్ పదవ తరగతి పరీక్షా ఫలితాలకు సంబంధించి వైఎస్సార్ జిల్లా రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచింది. ఈ పరీక్షలు కూడా 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 573 మంది పరీక్షలు రాయగా ఇందులో 506 మంది పాసై 88.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురకు సంబంధించి 333 మందికిగాను 283 మంది పాసై 84.98 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే బాలికలకు సంబంధించి 240 మందికి 223 మంది పాసై 92.92 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల్లో కూడా బాలికలదే పైచేయిగా నిలిచింది. ఈ ఫలితాల పట్ల డీఈఓ షేక్ షంషుద్దీన్, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ సాంబశివారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన బాధాకరం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : అహ్మదాబాద్‌లో విమాన ప్రమాద ఘటన చాలా బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన 5 నిమిషాల్లోనే కుప్పకూలడం విచారకరమన్నారు. ప్రమాద సమయంలో ఇద్దరు పైలట్లు, 12 మంది క్యాబిన్ సిబ్బందితో సహా 200 మందికిపైగా ప్రయాణికులు అందులో ఉన్నట్లు తెలిసిందన్నారు. మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, మరణించిన వారికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ విమాన ప్రమాదం నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేది నిర్వహించ తలపెట్టిన ర్యాలీలు, నిరసనలను వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ మార్పును యువత, విద్యార్థులు గమనించాలని కోరారు.

ఏడాది కూటమి పాలనలో ఏం సాధించారో చెప్పాలి



మహాసభల సందర్భంగా బద్వేలులో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ

అట్లూరు : కేంద్రంలో, రాష్ట్రంలో ఏడాది కూటమి పాలనలో ఏం సాధించారో ప్రజలకు చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య ప్రశ్నించారు. గురువారం బద్వేలు పట్టణంలోని సీపీఐ కార్యాలయం జేవీ భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ పట్టణ మహాసభలలో ఆయన మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్ అనే గొప్పలు చెప్పుకుంటూ ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం పూర్తికి నిధులు, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వంటి హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలం, ఇళ్లు ఆచరణలో అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి పి.మస్తాన్, పట్టణ కార్యదర్శి బాబు తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వ్యక్తి మృతి

కాశినాయన : మండలంలోని కొండ్రాజుపల్లె గ్రామానికి చెందిన కుమారి రమణయ్య (52) అనే వ్యక్తి గడ్డి మందు తాగి మృతి చెందాడు. కాశినాయన ఎస్ఐ యోగేంద్ర తెలిపిన వివరాల మేరకు.. మృతుడు అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడని, దీంతో పాటు అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెంది ఈనెల 10న గడ్డి మందు తాగాడు. వెంటనే అతన్ని పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి కడపలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా గురువారం రమణయ్య మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య సుబ్బలక్ష్మితోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



నాగమ్మ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : పట్టణానికి చెందిన నాగమ్మ అదృశ్యంపై కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగమ్మ మే 27న స్థానిక రామేశ్వరం మునిస్వామి దేవస్థానం ఎదురు వీధిలో ఉన్న తన చిన్న కుమారుడు గంగాధర్ ఇంటి నుంచి మనస్తాపంతో వెళ్లిపోయిందని కుమారులు గంగాధర్, బాబులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.


అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన అంకాలయ్య

జమ్మలమడుగు రూరల్ : మోరగుడి గ్రామానికి చెందిన చాకలి అంకాలయ్య (38) అనే వ్యక్తి గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ హైమావతి ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మోరగుడి గ్రామానికి చెందిన చాకలి అంకలయ్య గత కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి మద్యం తాగాడు. గురువారం ఆరోగ్యం సరిగా లేదని సోదరుడి కుమారుడు యోగేశ్వర్‌కుతో మాత్రలు తెప్పించుకున్నాడు. మాత్రలు వేసుకున్న తరువాత ఆయాసం ఎక్కువ కావడంతో వెంటనే తమ్ముడు సంజీవకు సమాచారం ఇచ్చారు. ఆటోలో జమ్మలమడుగులోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళుతుండగా ముక్కులో నుంచి రక్తస్రావమైంది. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక రాష్ట్ర డైరెక్టర్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకంలో రుచికరమైన భోజనం అందించాలని పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్ రావు పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన స్వయంగా భోజనం తిని నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం పంపిణీ చేసినందున విద్యార్థులు ఎలా తింటున్నారని అడిగి తెలుసుకున్నారు. వంటల నిర్వాహకులు పరిశుభ్రంగా ఉండాలని, వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మండలానికి వచ్చిన పాఠ్య పుస్తకాలు, విద్యా సామాగ్రిని ఆయన పరిశీలించారు. పాఠ్య పుస్తకాలన్నింటిని పాఠశాలలకు సరఫరా చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ శోభారాణి, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం గీత, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేని ప్రభుత్వం

ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : రాష్ట్రంలో ప్రభుత్వం రైతులకు పొగాకు, పత్తి పంటలను సాగు చేసుకోమని ప్రోత్సహించిందని, పంట చేతికి వచ్చిన తర్వాత సరైన గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి విమర్శించారు. గురువారం జమ్మలమడుగులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ వారిలో మానసిక స్థైర్యం నింపేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పొదిలిలో పర్యటిస్తే ఆయనపై కూటమి నాయకులు దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, కూటమి నాయకుల అరాచకాలు పెరిగిపోయాయన్నారు. ప్రతి పనికి కప్పం కట్టించుకుంటున్నారని చెప్పారు. ఈ పరిస్థితులు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తే వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి నిరసన తెలిపారన్నారు. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటుధరతోపాటు రైతులకు ఆర్బీకే సెంటర్ల ద్వార నాణ్యమైన విత్తనాలు, ఎరువులు నేరుగా గ్రామాలలోనే ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా కల్తీ విత్తనాలతో రైతులు మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతోందని ఇలాగే ఉంటే రాష్ట్ర ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, రైతు నాయకులు సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఏడాది పాలనలో సాధించిందేమీ లేదు

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఏడాది పాలనలో గొప్పలు చెప్పడం తప్ప సాధించింది ఏమీ లేదని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. గురువారం కడపలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా సూపర్ సిక్స్‌కు, ఉచిత బస్సు ప్రయాణానికి ఇప్పటి వరకు దిక్కులేదన్నారు. ఉచిత ప్రయాణంపై పండుగల పేరు చెప్పి కాలయాపన చేశారన్నారు. నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలకు దిక్కులేదన్నారు. రైతులను ఆదుకున్న పరిస్థితి లేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టో అంటే 5 ఏళ్ల కాలపరిమితికి సంబంధించిందని, ఇష్టం వచ్చినప్పుడు అమలు చేయడం కాదన్నారు. రాష్ట్రంలో 87 లక్షల మంది విద్యార్థులు ఉంటే 67 లక్షల మందికి మాత్రమే తల్లికి వందనం ఇస్తూ 20 లక్షల మంది విద్యార్థులను మోసం చేశారన్నారు. అన్నదాత సుఖీభవ మోసమేనన్నారు. రాష్ట్రంలో 93 లక్షల మంది రైతులు ఉండగా, కత్తెర పేరుతో 45 లక్షల మంది రైతులకు ఇస్తున్నారన్నారు. ప్రతి నిరుద్యోగికి రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదన్నారు. చంద్రబాబు సాధించిన ప్రగతి అప్పులు తీసుకోవడం, బీజేపీకి ఊడిగం చేయడమేనని ధ్వజమెత్తారు. బీజేపీని వ్యతిరేకించే దమ్మున్న పార్టీ కాంగ్రెస్ అని అన్నారు.

చదువుతోపాటు నైతిక విలువలు నేర్పాలి



రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఎదుట కన్నీటి పర్యంతమవుతున్న చిన్నారి తల్లి స్నేహ

ప్రొద్దుటూరు రూరల్ : పిల్లలకు చదువుతోపాటు నైతిక విలువలు నేర్పాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. గత నెల 23వ తేదీన వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె గ్రామంలో అత్యాచారం, హత్యకు గురైన చిన్నారి కుటుంబ సభ్యులను గురువారం ప్రొద్దుటూరు మండలం అమృతానగర్‌లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పరామర్శించారు. హత్యకు గురైన చిన్నారి తల్లి స్నేహతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను పని వద్ద నుంచి ఇంటికి వచ్చే సరికి తన కూతురు గుండెలపై కూర్చొని ముద్దు ముద్దు మాటలతో నవ్విస్తూ ఉండేదని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. చిన్నారి ఫొటోలను చైర్‌పర్సన్‌కు చూపించి స్నేహ విలపించారు. అనంతరం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మీడియాతో మాట్లాడుతూ నిందితుడు తనకు తాను శిక్ష వేసుకున్నా హత్యకు గురైన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తరపున రూ.4,12,500 చెక్కు అందించామని, మరో రూ.4.5 లక్షలు త్వరలోనే ఇస్తామన్నారు. కాగా చిన్నారి తండ్రి చెన్నయ్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని బంధువులు కోరారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ప్రొద్దుటూరు, మైదుకూరు డీఎస్పీలు భావన, భవాని, తహసీల్దార్ గంగయ్య, ఐసీడీఎస్ రూరల్ సీడీపీఓ అరుణకుమారి పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి నాయకులు

కడప కార్పొరేషన్ : జిల్లాలో శ్రీ చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ షఫీ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గురు ప్రసాద్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకం కింద రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ రాష్ట్రంలో 87లక్షల మంది విద్యార్థులు ఉండగా కేవలం రూ.8వేల కోట్లు మాత్రమే విడుదల చేయడం దారుణమన్నారు. వారందరికీ తల్లికి వందనం ఇవ్వాలంటే రూ.13వేల కోట్లు అవసరమవుతుందని తెలిపారు. విద్యార్థులకు 4 సెమిస్టర్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇంకా విడుదల చేయలేదన్నారు. ప్రైవేటు కాలేజీలు, పాఠశాలల్లో ఫీజుల దోపిడీ ఎక్కువైందని, రకరకాల పేర్లు చెప్పి దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త, నగర అధ్యక్షుడు శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కేవీపల్లె : బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన అన్నమయ్య జిల్లా చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారి ఈతమానువడ్డిపల్లె సమీపంలో గురువారం జరిగింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ల అపహరణ

పులివెందుల రూరల్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయి. గురువారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మారుతి హాలు రోడ్డు, అంబకపల్లె రోడ్డు, శ్రీరామా హాలు రోడ్డు, పాత బస్టాండు తదితర ప్రాంతాలలో దుండగులు నాలుగు సెల్‌ఫోన్లను అపహరించినట్లు బాధితులు తెలిపారన్నారు. అలాగే సాయంత్రం వేళలో ఆయా వీధులలో ఇళ్ల ముందు కూర్చొని ఉన్న మహిళల దగ్గర ఉన్న సెల్‌ఫోన్లను లాక్కెళ్లారని వారు వాపోయారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పలువురు సీడీపీఓల బదిలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని పలువురు సీడీపీఓలను బదిలీ చేస్తూ స్త్రీ శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలిలా ఉన్నాయి.

సీడీపీఓ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం	బదిలీ అయిన ప్రాంతం
వైఎస్సార్ కడపజిల్లా		
ఎస్.ముంతాజ్‌బేగం	ముద్దనూరు	చాపాడు
కె.హైమావతి	ప్రొద్దుటూరు	ముద్దనూరు
ఎం.శ్రీలత	పులివెందుల	కమలాపురం
ఎస్.సునంద	కడప-1	రాజంపేట
జె.వాణిశ్రీ	ఏసీడీపీఓ	కడప-1
అన్నమయ్య జిల్లా		
వై.పద్మావతి	లక్కిరెడ్డిపల్లె	కంబదూరు (అనంతపురంజిల్లా)
ఎ.సుజాత	మదనపల్లె	తంబళ్లపల్లె
వై.నాగవేణి	తంబళ్లపల్లె	మదనపల్లె
టీపీ సౌభాగ్యమ్మ	రైల్వేకోడూరు	పిచ్చాటూరు (తిరుపతి జిల్లా)
ఎం.సునీత	ఏసీడీపీఓ (సత్యసాయిజిల్లా)	మదనపల్లె
కె.ప్రమీల	పీడీ కార్యాలయం, రాయచోటి	పుత్తూరు (తిరుపతి జిల్లా)

వీరితోపాటు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న 13 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ కర్నూలు రీజనల్ జాయింట్ డైరెక్టర్ పి.రోహిణి ఉత్తర్వులు జారీ చేశారు.

సూపర్‌వైజర్ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం	బదిలీ అయిన ప్రాంతం
ఎస్.రేణుక	కడప-1	పులివెందుల
తులశమ్మ	లక్కిరెడ్డిపల్లె	టి.సుండుపల్లె
ఎం.శారద	రాయచోటి	లక్కిరెడ్డిపల్లె
పద్మజారాణి	లక్కిరెడ్డిపల్లె	రాయచోటి
ఎం.సుగుణ	రాయచోటి	కడప-1
సి.సరితాదేవి	పులివెందుల	కడప-1
ఎం.నాగరత్నమ్మ	కడప-1	రాజంపేట
ఎం.నిర్మల	రైల్వేకోడూరు	ముద్దనూరు
వి.రూపలక్ష్మి	రాయచోటి	లక్కిరెడ్డిపల్లె
టి.నాగేశ్వరి	పులివెందుల	కడప ఈఓ ఆఫీసు
కె.ఓబులమ్మ	కడప	ముద్దనూరు
కె.లలిత	రైల్వేకోడూరు	రాయచోటి ఈఓ ఆఫీసు
ఆర్.రాజేశ్వరి	చిట్వేలి	కర్నూలు ఈఓ ఆఫీసు